క్లుప్తంగా

రేపు ఆలయ భూముల వేలం పాట

రాజుపాళెం : టంగుటూరు గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 28.5 ఎకరాల భూములకు ఈనెల 10న బుధవారం ఉదయం 10 గంటలకు వేలం పాట వేయనున్నట్లు ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్యగారి సత్రంలో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు ఒక్కొక్కరు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

దివ్యాంగుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతి

ప్రొద్దుటూరు : దివ్యాంగుల సమస్యలపై సోమవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సొసైటీ రాష్ట్ర కన్వీనర్ దొడియం అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు, ఖాజామొహిద్దీన్ వినతి పత్రం అందించారు. దివ్యాంగులకు 80శాతం పైబడిన వైకల్యం కలిగిన వారికి రూ.10వేలు, మిగిలిన వారికి రూ.6వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016 అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీల్లాగా దివ్యాంగులకు కూడా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులందరికి 35 కేజీల బియ్యం ఇవ్వాలన్నారు. వలంటీర్ బావమ్మ, సంజీవ్‌కుమార్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరుకానున్న మండల సమావేశానికి ప్రజాప్రతినిధులందరూ హాజరుకావాలన్నారు. అధికారులు పూర్తి నివేదికలతో సభకు రావాలని ఎంపీపీ కోరారు.

సీతారామాపురంలో కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరంలో 75 మంది పరీక్షలు నిర్వహించినట్టు కంటి వైద్యులు ఎంఎస్ తేజ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు జరిపిన వారిలో 14 మందికి కంటి ఆపరేషన్లు, 35 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించామన్నారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. త్వరలోనే కంటి అద్దాలను పంపిణీ చేస్తామని కంటి వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్రవంతి, ఆశ కార్యకర్త వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఆర్డీఓకు వినతి

బద్వేలు అర్బన్ : బద్వేలు, గోపవరం మండలాల పరిధిలోని 33 సర్వేనెంబర్లలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సోమవారం ఆర్డీఓ ఆకులవెంకటరమణకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న బద్వేలు పట్టణంలో కొంత మంది కబ్జారాయుళ్లు విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని అన్నారు. తక్షణమే ఆర్డీఓ విచారణ జరిపి ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

10న పాలిసెట్

ప్రొద్దుటూరు : ఈ నెల 10న పాలిసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరులోని 10 సెంటర్లలో 4,049 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పరీక్షలకు అప్లై చేసిన అభ్యర్థులకు హాల్ టికెట్ రాకుంటే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 10న ఉదయం 9.30 గంటలకు ఎగ్జామ్ ఫీజు రూ.400 చెల్లిస్తే పరీక్షకు అనుమతిస్తామని తెలిపారు.

న్యాయశాస్త్ర విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయశాస్త్ర విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వర రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి వి.శివకుమార్ మాట్లాడుతూ న్యాయశాస్త్ర ఫలితాల్లో పాస్ పర్సెంటేజీ చాలా దారుణంగా ఉందన్నారు.

ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలి

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి
- అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కొత్తమిద్దె రఘురామిరెడ్డి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, సభ్యులు

ప్రొద్దుటూరు : నూతన ఆలయ పాలకమండలి అగస్త్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యుడిగా కొత్తమిద్దె రఘురామిరెడ్డితోపాటు పాలకమండలి సభ్యులుగా ఎం.మల్లికార్జున శెట్టి, జి.గోవర్ధన్‌రెడ్డి, కె.వెంకట సుబ్బయ్య, సీపీ నాగలక్షుమ్మ, ఎ.నాగేశ్వరి, డి.భారతి, బి.వెంకటేశు, పి.సావిత్రమ్మ, టి.మహేశ్వరశర్మ సోమవారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు కొవ్వూరు రమేష్‌రెడ్డి కోరిక మేరకే కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేశామని తెలిపారు. కొవ్వూరు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ పదవి కేటాయించిన ఎమ్మెల్యే రాచమల్లుకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఆలయ అభివృద్ధికి రఘురామిరెడ్డి కృషి చేసి తన మాట నిలపాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, దేవదాయశాఖ మంత్రి ఓఎస్డీ యల్లంశెట్టి ఓబన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ యెల్లాల కుమార్‌రెడ్డి, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పల్లేటి శంకర్‌రెడ్డి, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, కొర్రపాడు సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు

అభివృద్ధిలో దూసుకుపోతున్నాం

అభివృద్ధిలో ప్రొద్దుటూరు నియోజకవర్గం శరవేగంగా దూసుకుపోతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ కార్యక్రమాలతో జగనన్న ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. వ్యక్తిగతంగా నియోజకవర్గంలో విద్యకు, వైద్యానికి, ఆలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణానికి కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించానన్నారు. టీడీపీ నేతల చౌకబారు విమర్శలు పట్టించుకోకుండా ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ నేతలు చేసే చౌకబారు విమర్శలు నీటి మీద బుడగలాంటివని, వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసునన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లెంట్ అథారిటీ సభ్యుడు కాకర్ల నాగేశ్వారెడ్డి, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే సీఎం ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని అభివృద్ధి చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం మైదుకూరులోని 14వ వార్డులో ఆయన అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని మదీన మసీదు వీధులు, దర్గా వీధి, మూలబాట వీధుల్లో ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 14వ వార్డులో 117 మంది తల్లులకు అమ్మ ఒడి పథకం కింద రూ.82,66,000 లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కింద 186 మందికి రూ.59,91,606 అందించినట్టు చెప్పారు. వీటితోపాటు 81 మందికి పింఛన్లు, 129 మందికి వైఎస్సార్ చేయూత, 41 మందికి రైతు భరోసా తదితర పథకాల ద్వారా మొత్తం రూ.3,79,09,491, వార్డులోని 180 మంది పేదలకు పక్కా ఇళ్లు, సీసీ రోడ్లు, పైపులైన్ వంటి వాటికి రూ.3,57,50,000 ఖర్చు చేసినట్టు తెలిపారు. వార్డులో మొత్తం రూ.7,36,59,491 లబ్ధి చేకూరిందని వివరించారు. వార్డులో పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ సీసీ రోడ్లను వేయాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, ఏఈ నిరంజన్‌రెడ్డిని ఆదేశించారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్యకు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వార్డు ఇన్‌చార్జి ఖాదర్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, భరత్‌కుమార్‌రెడ్డి, గోశెట్టి లక్షుమయ్య, గోశెట్టి రామచంద్ర, మైనార్టీ విభాగం నాయకులు షౌకత్ ఆలీ, అక్బర్, నాయబ్ రసూల్, మాబు సాహెబ్, వీరభద్రుడు, పిల్లి నాగయ్య, కూశెట్టి రాయుడు, షాషా తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న నాడు-నేడు పనులు



రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు

గోపవరం : మనబడి నాడు–నేడు పనులు ఊపందుకున్నాయి. రెండవ విడత మనబడి నాడు–నేడు కింద మండలంలో 30 పాఠశాలలు మంజూరయ్యాయి. వీటిలో 21 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలలు, 2 అంగన్వాడీ కేంద్రాలు మంజూరయ్యాయి. మొదట్లో పనులు నత్తనడకన సాగినప్పటికీ ప్రస్తుతం ఈ పనులు మంజూరైన అన్ని పాఠశాలల్లో ఊపందుకున్నాయి. జూన్ 12వ తేదీలోపు నాడు–నేడు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం విద్యాశాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆ మేరకు అధికారులు ఎప్పటికప్పుడు కసరత్తు చేస్తున్నారు. ప్రతి శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీలతో ప్రత్యేకాధికారి నాగరాజ జరుగుతున్న పనులపై సమీక్షిస్తున్నారు. వారం వారం పనుల్లో పురోగతి కనిపించాలన్నారు. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు నాడు–నేడు కింద మంజూరైన పాఠశాలల్లో పనులన్నీ పూర్తి చేసి విద్యార్థినీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనుల నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని మండల ప్రత్యేకాధికారి ప్రత్యేకాధికారి నాగరాజు పేర్కొన్నారు. వేసవి సెలవులు సాకు చూపించి పనులు సకాలంలో పూర్తి చేయకపోతే అలాంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెనకాడబోమన్నారు.

పాలసీదారుల సొమ్ము భద్రతే లక్ష్యం



జోనల్ లియాఫి అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : ప్రపంచంలో ఆర్థిక సమీకరణ కలిగి ఉన్న పది సంస్థలలో మూడో స్థానంలో ఉన్న ఎల్‌ఐసీలో పొదుపు చేసుకున్న పాలసీదారుల సొమ్ముకు 13 లక్షల మంది ఏజెంట్లు కాపలాదారులుగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జోనల్ లియాఫి అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన లియాఫీ ఆల్ ఇండియా జనరల్ కౌన్సిల్ సమావేశంలో హైదరాబాద్ జోన్ అధ్యక్షుడిగా జంపాల కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలుత తనను బ్రాంచి అధ్యక్షుడుగా, తర్వాత డివిజన్ అధ్యక్షుడుగా ఎన్నుకున్నారని తెలిపారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకుని ఈ స్థాయికి ఎదిగానన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసీపై నియంతలా వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో కడప డివిజన్ లియాఫి అధ్యక్షుడు జయభారత్ రెడ్డి, కార్యదర్శి కదిరప్ప, కోశాధికారి కృష్ణా నగేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒంటెద్దు బండలాగుడు పోటీలు



ఒటెంద్దు బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం ఒంటెద్దు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రొద్దుటూరుకు చెందిన గోర్ల సుబ్బరాయుడు ఎద్దు 2500 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచింది. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, బీరం వెంకటరామిరెడ్డిలు ప్రారంభించారు. 22 ఎద్దులు పాల్గొన్నాయి. రెండో స్థానంలో ప్రొద్దుటూరు నాగేంద్ర ఎద్దు 2384, మూడో స్థానంలో ప్రొద్దుటూరు తుంగా నారాయణ ఎద్దు 2282, నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా రుద్రవరం ధరణి ఎద్దు 2074, ఐదో స్థానంలో చాగలమర్రి మండలంలోని మల్లెవేముల నాగరాజు ఎద్దు 2072, ఆరో స్థానంలో మైదుకూరు మహానంది ఎద్దు 2054 అడుగులు లాగాయి.. ఆ ఎద్ల యజమానులకు రూ.10,000, రూ.7000 రూ.4000, రూ.2500, రూ.2000లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి జయరామిరెడ్డి, జయచంద్రారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 29, 30, 32వ వార్డుల పరిధిలోని గుంతపల్లె, కుమ్మరికొట్టాలులో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. నాలుగేళ్ళ కాలంలో పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేయడంతో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ముంగిటకే అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, నేడు ఆ పరిస్థితి లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావిస్తూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవిశ్రీరాములు, కౌన్సిలర్లు చెన్నయ్య, రామ్మోహన్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, రామచంద్రనాయుడు, శ్రీనివాసులనాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి, ఆర్ఐ నాగేశ్వరి, ఏఎస్ఐ సుబ్బారావు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికి సంక్షేమ ఫలాలు

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అక్కంపేట, అమగంపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఏ మేరకు లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్‌సీపీ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, స్థానిక సర్పంచ్ సౌమ్య దీప్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సురేష్, కృష్ణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు

బి.కోడూరు : మండల పరిధిలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలను 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి టి.కౌశిక తెలిపారు. జనుములు 10 కేజీల ప్యాకెట్ ధర రూ.840లు కాగా రైతు వాటాగా రూ.420లు, జీలుగలు 10 కేజీల ప్యాకెట్ ధర రూ.790లు కాగా రైతు వాటాగా రూ.395లు, పిల్లపెరస 8 కేజీల ప్యాకెట్ ధర రూ.776లు కాగా రైతు వాటాగా రూ.388లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ తీసుకుని వెళ్ళి వారికి సమీపంలోని రైతుభరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఊర్లకు వెళుతున్నారా.. జాగ్రత్త

పోరుమామిళ్ల : వేసవిలో ఇంటికి తాళం వేసి ఊర్లకు వెళుతున్నారా? ఏమరిపాటుగా జాగ్రత్తలు తీసుకోకుండా వెళితే దొంగలు ఇంటిని ఊడ్చేసే ప్రమాదం ఉందని ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల పట్టణంలో రెండిండ్లల్లో దొంగలు పడి దోచుకున్న నేపథ్యంలో ఆయన సోమవారం పట్టణంలో ఇండ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊర్లే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దొంగతనాల నుండి రక్షణ పొందవచ్చన్నారు. ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. ఊర్లకు వెళ్లే టపుడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా పెడతామన్నారు.

అశ్వవాహనంపై చెన్నకేశవుడు



పల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను అశ్వ వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారిని ఆశీనులు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ్ కానాల రాధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, దామోదర్‌రెడ్డి,ఇన్స్పెక్టర్ ఆర్ఆర్ నరసింహా సింగ్, ఈఓ నరసయ్య భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ల సహకారంతో చోరీలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఎస్ఐ హరిప్రసాద్

బద్వేలు : వలంటీర్లు సహకారంతో వేసవిలో జరిగే దొంగతనాలకు అడ్డుకట్ట వేసేలా ప్రణాళిక సిద్ధం చేశామని పోరుమామిళ్ల ఇన్‌చార్జి ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ సచివాలయంలో ఆయన వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇండ్ల యజమానుల సమాచారాన్ని సేకరించి తమకు అందజేస్తే నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. వలంటీర్లు తమ పరిధిలో ఉన్న 50 ఇండ్లకు సంబంధించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, పంచాయతీరాజ్ విస్తరణాధికారి బాస్కర్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరిప్రజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు పాల్గొని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, రచయితలు డీకే చదువుల బాబు, జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడారు.కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, వరలక్ష్మి, చంద్రకళ, శ్రీకాంత్, జేవీవీ కన్వీనర్ చంద్రశేఖర్, గ్రంథాలయ సిబ్బంది గంగాదేవి పాల్గొన్నారు.

■ స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రంథాలయ వ్యవస్థాపనకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు కృషి చేశారని తెలిపారు. యోగా టీచర్ వెంకటసుబ్బమ్మ, రిటైర్డు తెలుగు టీచర్లు వీఎం భాస్కర్ రాజు, బాలయ్య, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, రెహ్మాన్‌ఖాన్, రవిబాబు, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఒత్తిడిలేని విద్యాబోధన

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులపై ఒత్తిడి లేకుండా ఆకాశ్, బైజూస్ ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తామని ఆకాశ్, బైజూస్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం జీవనజ్యోతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో కెరియర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే నీట్, జేఈఈ సిలబస్‌ను బోధిస్తామన్నారు. విద్యార్థులకు ఒత్తిడి లేకుండా సులభశైలిలో అర్థమయ్యే విధంగా చెబుతామని తెలిపారు. జీవనజ్యోతి పాఠశాల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, కరస్పాండెంట్ అమరనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజుపాళెం : విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. రాజుపాళెంలోని గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులను ఎంఈఓ, సర్వజ్ఞ హైస్కూల్ కరస్పాండెంట్ నంద్యాల వెంకటశివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో గ్రంథాలయంలో శిక్షణా తరగతులు పెట్టడం సంతోషకరమైన విషయమని చెప్పారు. పిల్లలు చదవడం అలవాటు చేసుకోవడం వలన పుస్తకాలపై అవగాహన వస్తుందన్నారు. గ్రంథాలయ అధికారి ప్రతాపుడు, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, పురుషోత్తం, బీడీసీ నరసింహారెడ్డి, హుసేనయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 29 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను గ్రంథాలయ అధికారి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : పుస్తక పఠనం వలన విజ్ఞానం పెరుగుతుంది. సమాజాన్ని, ప్రపంచాన్ని, చరిత్రను, గొప్పవారిని తెలుసుకొనేందుకు దోహద పడుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గసభ్యులు ఇన్నయ్య, మహమ్మద్ యాసిన్, రచయిత బొల్లు రామమోహన్, పంచాయతీ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు సమ్మర్ క్యాంప్ నడుస్తుందన్నారు. నెల రోజులకు పైగా జరుగుతున్న విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు, యువత పాల్గొని గ్రంథాలయంలోని పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలన్నారు. గ్రంథాలయ అధికారి ఆఫ్రిది మాట్లాడుతూ శిబిరంలో వివిధ పోటీలు నిర్వహించి జూన్ 11న విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఖాశింవలి, ఖదీర్, బాష, ఖాజావలి, రంగనాయకులు పాల్గొన్నారు.

చాపాడు : గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరమని గ్రంథాలయ అధికారి జే.శివశంకర్ రెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయం వద్ద సోమవారం వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది అఫ్రీన్, చంద్ర, సుప్రజ, అంజలి, నక్కలదిన్నె బీడీసీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక వ్యాపారులు ముందుకు రావాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఉన్న 2226 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని 15 సంవత్సరాలకు బాడుగకు ఇస్తామని కడప ఆర్టీసీ రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, బద్వేలు డీయం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం పోరుమామిళ్లలో వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కడప జోన్‌లోని 8 జిల్లాల్లో 26 స్థలాలు బాడుగకు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగా పోరుమామిళ్లలో ఉన్న స్థలం బాడుగకు ఇస్తామని, టెండర్ డాక్యుమెంట్లు ఈనెల 22లోగా డౌన్‌లోడ్ చేసుకుని, టెండర్ ఫారం 23న మధ్యాహ్నం 2 గంటలలోగా కడప ఈడీ ఆఫీసులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. టెండర్ ప్రక్రియకు రెండు బిడ్లు వేయాలని, టెక్నికల్ బిడ్, ప్రైస్ బిడ్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఏడీసీ బాషా, పట్టణ వ్యాపారులు పాల్గొన్నారు.

యువకుడి నిజాయితీ



ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి సమక్షంలో బాధితురాలు సంజమ్మకు నగలు అందిస్తున్న గురివిరెడ్డి

దువ్వూరు : తనకు దొరికిన బంగారు నగలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించి యువకుడు నిజాయితీని చాటుకున్నాడు. మండల పరిధిలోని గుడిపాడు గ్రామానికి చెందిన గోపిరెడ్డి గురివిరెడ్డి సోమవారం ఉదయం తోటకు వెళుతుండగా దస్తగిరి స్వామి దర్గా వద్ద బంగారు నగల ప్యాకెట్ దొరికింది. దానిని తెరిచి చూడగా అందులో రూ.3లక్షలు విలువ చేసే 5 తులాల బంగారు నగలు ఉన్నాయి. వీటిని గురివిరెడ్డి తీసుకుని నేరుగా దువ్వూరు పోలీస్టేషన్‌లో ఎస్ఐ రాఘవేంద్రా రెడ్డికి అప్పగించారు. మైదుకూరు మండలం ఉత్సలవరం గ్రామానికి చెందిన బేతంచెర్ల చిన్న సంజమ్మ చిన్నసింగనపల్లెకు పెళ్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో నగల ప్యాకెట్ పోగొట్టుకుంది. ఈ మేరకు సంజమ్మ గుడిపాడు గ్రామ సర్పంచ్ రాజుపాళెం మాబుషరీఫ్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన ఎస్ఐకి ఈ సంఘటన గురించి చెప్పారు. దీంతో ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి సంజమ్మను పోలీస్‌స్టేషన్‌కి పిలిచించి నగల వివరాలను కనుగొని ఆమెవేనని నిర్ధారించారు. వాటిని ఆమెకు అప్పగించారు. బంగారు నగలను అప్పగించిన గురివిరెడ్డిని ఎస్ఐ అభినందించారు. ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి, గురివిరెడ్డిలకు సంజమ్మ కృతజ్ఞతలు తెలిపారు.